## 20వ అధ్యాయము

# స్తుతి మరియు ఆరాధన

> అప్పుడా స్త్రీ అయ్యా, నీవు ప్రవక్తవని గ్రహించుచున్నాను.మా పితరులు ఈ పర్వతమందు ఆరాధించిరి గాని ఆరాధింపవలసిన స్థలము యెరూషలేములో ఉన్నదని మీరు చెప్పుదురని ఆయనతో అనగా యేసు ఆమెతో ఇట్లనెను, "అమ్మా, ఒక కాలము వచ్చుచున్నది; ఆ కాలమందు ఈ పర్వతము మీదనైనను యెరూషలేములోనైనను మీరు తండ్రిని ఆరాధింపరు అయితే యదార్థముగా ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోని తండ్రిని ఆరాధించు కాలము వచ్చుచున్నది; తన్ను ఆరాధించువారు అట్టివారే కావలెనని తండ్రి కోరుచున్నాడు. దేవుడు అత్మ గనుక ఆయనను ఆరాధించు వారు ఆత్మతోను సత్యముతోను ఆరాధింపవలెననెను. (యోహాను 4:19-24)

యేసు నోటినుండి వెలువడిన ఈ మాటలు ఆరాధన యొక్క ప్రాముఖ్యమైన విషయాలను మనం అర్థం చేసుకోవడానికి పునాదివంటివి. ఆయన "యదార్థమైన ఆరాధికులను" గురించి మాట్లాడుచూ, వారికి ఉండవలసిన లక్షణాలను విశదీకరించాడు. దీనిని బట్టి ఆరాధీకులు చాలా మంది ఉన్నారు కాని అందరూ సరియైన లేదా నిజమైన ఆరాధీకులు కారని అర్థమవుతుంది. దేవుని ఆరాధించుచున్నామని వారు 'తలంచుచూ' ఉంటారు కాని వారు ఆరాధనకు కావలసిన విషయాలను అనుసరించ లేక పోవుటను బట్టి నిజంగా దేవుని ఆరాధించలేక పోవుచున్నారు.

"ఆత్మతోను సత్యముతోను" ఆరాధించట యదార్థమైన ఆరాధీకుల లక్షణమని యేసు ప్రకటించాడు. దీనిని బట్టి నిజమైన ఆరాధీకులు కానివారు "శరీరముతోను మరియు కపట మనస్సుతోను" ఆరాధిస్తారని చెప్పవచ్చును. లోక సంబంధమైన అబద్ధ ఆరాధీకులు సంచలనాత్మకమైన ఆరాధన చేస్తున్నట్లు కనిపించవచ్చు అయితే అది దేవుని ప్రేమించు హృదయము నుంచి వచ్చుట లేదు కాని కేవలం మనుష్యుల మెప్పుకొరకు చేయు ఆరాధనైయున్నది.

***యదార్థమైన ఆరాధన నిజంగా దేవుని ప్రేమించు హృదయాన్నుంచి మాత్రమే రాగలదు***, నిజంగా దేవుని ప్రేమించు హృదయమునుండి మాత్రమే సరియైన ఆరాధన వస్తుంది. కాబట్టి ఆరాధన అనేది మనము సంఘములో కూడినప్పుడు మాత్రమే చేయు కార్యము కాదుకాని దేవుని ఆజ్ఞలకు లోబడి మన జీవితంలో ప్రతి క్షణము మనము చేయవలసిన పనియైయున్నది. ఆశ్చర్యమైనరీతిలో యేసుతో ముచ్చటించుచున్న ఆ స్త్రీ ఐదు సార్లు వివాహమాడి, ప్రస్తుతము ఒక మనుష్యునితో జీవించుచున్నది. ఆ స్త్రీ దేవుని ఆరాధించుటకు సరియైన స్థలమును గురించి తర్కించాలని ఆశిస్తున్నది. దేవునికి వ్యతిరేకముగా జీవించుచూ ఆరాధనలో పాల్గొనే అనేకమంది

నామకార్థపు మతస్థులకు ఈ స్త్రీ ప్రతినిధిగా మనకు కన్పిస్తుంది. వారు నిజంగా దేవుని ఆరాధించువారు కారు.

హృదయ స్పందనలేని అబద్ధీకమైన ఆరాధన చేయు సద్దుకయ్యులను మరియు పరిశయ్యులను యేసు ఓ సారి ఈ విధంగా గద్దించాడు:

> ''వేషధారులారా, ***ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరచుదురు గాని వారి హృదయము నాకు దూరముగా ఉన్నది***; మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు, అని యెషయా మిమ్మును గూర్చి ప్రవచించిన మాట సరియే అని వారితో చెప్పెను.'' (మత్తయి 15:7-9)

యేసు జీవించిన కాలములో ఉన్న యూదులు మరియు సమరయులు వారు ఆరాధించు స్థలములకు అధిక ప్రాముఖ్యతను ఇచ్చినప్పటికీ, దేవుడు ఆరాధించబడే “స్థలము” అంత ప్రాముఖ్యం కాదని  మన హృదయస్థితి, దేవుని పట్ల మనకున్న భావము ఆరాధన యొక్క విలువను నిర్ణయిస్తుందని యేసు (ప్రభులవారు) తెలియజెప్పారు.

నేటి సంఘాలలో “ఆరాధన” అని పిలువబడుచున్న కార్యము జీవంలేని ఆరాధికులు చేసే మృతమైన ఆచారము మాత్రమే. ప్రజలు ఏమాత్రము ఆలోచించకుండా ఎవరో దేవుని గురించి పలికిన మాటలు చిలుక పలుకులవలె “ఆరాధన గీతాలు” పాడుచూ ఉంటారు. కాని వారి హృదయంలో ఉన్నదానికి మరియు వారి జీవిత నడవడికకు ఏమాత్రం పొంతన లేని కారణాన ఆ ఆరాధన వ్యర్థమైనదిగా ఉంటున్నది.

“నీవెంత ఘనుడవుదేవా అని” హృదయ శుద్ధిలేని వెయ్యి ఆదివారపు ఆరాధన కీర్తనల కన్నా “నిన్ను ప్రేమించుచున్నానని” హృదయపూర్వకముగా సామాన్యమైన మరియు విధేయులైన దేవుని పిల్లలు చేయు ఆరాధనను దేవుడు ఆలకిస్తాడు.

## ఆత్మతో ఆరాధించుట

ఆత్మతో ఆరాధించుట అనగా అన్యభాషలతో పాడుట అని కొంతమంది చెబుతూ ఉంటారు. కాని యేసు చెప్పిన మాటలకు మరియు ఈ వ్యాఖ్యానానికి చాలా తేడా కన్పిస్తుంది. “అయితే యదార్థముగా ఆరాదించువారు ఆత్మతోను సత్యముతోను తండ్రిని ఆరాధించుకాలము వచ్చుచున్నది, అది ఇప్పుడు వచ్చేయున్నది”, అని యేసు చెప్పారు. ఆయన ఈ విధంగా ప్రకటించినప్పుడు, ఆత్మతో ‘ఆరాధించడానికి ఉన్న షరతులు అనుసరించగలిగినవారు ఉన్నారని పైమాటలనుబట్టి మనకు అర్థమవుతుంది. పెంతుకోస్తు దినము వరకు  ఎవరు అన్య భాషలలో మాట్లాడలేదన్న విషయం మనకందరికి విదితమే. కాబట్టి ప్రతి విశ్వాసి అన్యభాషలలో మాట్లాడినా లేక మాట్లాడలేక పోయిననూ దేవుని ఆత్మతోను సత్యముతోను ఆరాధించవచ్చును, అన్యభాషలతో పాడి,ప్రార్థించుట తప్పకుండా విశ్వాసియొక్క ఆరాధనలో ఉపయోగపడుతుంది కాని ఒక్కోసారి అది హృదయ స్పందనలేని ఆచారంగా కూడా మారుతూ ఉంటుంది.

అ.కా 13:1-2లో ఆది సంఘముయొక్క ఆరాధన గురించి ఆశక్తికరమైన ఆలోచన కన్పిస్తుంది.

> అంతియొకయలోనున్న సంఘములో బర్నబా, నీగెరనబడిన సుమెయోను, కురేనీయుడైన లూకియ చతుర్ధాధిపతియైన హేరోదుతో కూడ పెంచబడిన మన యేసు, సౌలు అను ప్రవక్తలును బోధకులును ఉండిరి. ***వారు ప్రభువును సేవించుచు*** ఉపవాసము చేయుచుండగా పరిశుద్ధాత్మ నేను బర్నబాను సౌలును పిలిచిన పనికొరకు వారిని నాకు ప్రత్యేకపరచుడని వారితో చెప్పెను(అ.కా 13:1-2).

ఈ వాక్యభాగములో "వారు ప్రభువును సేవించుచు" అనే మాటను మనము గమనించాలి. ఈ మాటకు అర్థం వారు ప్రభువుని ఆరాధించుచున్నామని చెప్పుట సరియైనదే దీనిని బట్టి యదార్థమైన ఆరాధన అనగా ప్రభువుని సేవించుట అని చెప్పవచ్చును. మన స్నేహం ప్రేమ ప్రభువు మీద మాత్రమే కేంద్రీకరించబడినచో అది యదార్థమైనది అవుతుంది.

## ఆరాధించు పద్ధతులు

ఇశ్రాయేలీయుల ఆరాధన పుస్తకముగా పిలవబడే కీర్తనల గ్రంథం అనేక రీతులుగా దేవుని ఆరాధించాలని మనలను హెచ్చరిస్తూ ఉంటుంది. ఉదాహరణకు కీంర్త 32లో నీతిమంతులారా యెహోవానుబట్టి సంతోషించుడి ఉల్లసించుడి (కీర్తన 32:11) అని వ్రాయబడి ఉంది.

గౌరవ ప్రదంగా, మౌనముగా ఎలా ఆరాధిస్తామో, ఆనందంతో ఎలుగెత్తుట కూడ ఆరాధనలో భాగమే:

> నీతిమంతులారా, యెహోవాను బట్టి ***ఆనంద గానము*** చేయుడి. స్తుతిచేయుట యదార్థవంతులకు శోభస్కరము. సితారాతో యెహోవాను స్తుతించుడి. పది తంతుల స్వరమండలముతో ఆయనను కీర్తించుడి. ఆయననుగూర్చి నూతన కీర్తన పాడుడి(కీర్తన 33:1-3).

అవును మనము ఆరాధనలో దేవునికి కీర్తనలు పాడాలి, అయితే మన పాటలు ఆనందముతో కూడినవి అయ్యి ఉండాలి. ఇది మన అంతరంగ హృదయ స్థితి బయటకు తెలియజేయు ఒక మార్గమైయున్నది. మన ఆనందకరమైన పాటలకు వివిధరకములైన సంగీత వాయిద్యములను ఉపయోగించవచ్చును. కాని ఇక్కడ నేను ఒక విషయాన్ని ప్రస్తావించాలి. అదేమంటే అనేక సంఘ ఆరాధన కూడికలలో ఈ ఎలక్ట్రికల్ సంగీత వాయిద్యాల చప్పుడు మనం పాడేపాటలకన్న ఎక్కువగా ఉంటున్నాయి. కాబట్టి ఆ శబ్దాన్నైనా తగ్గించాలి లేక పూర్తిగానైన మాని వెయ్యాలి. కీర్తనాకారునికి ఎప్పుడూ ఇటువంటి సమస్య ఎదురు కాలేదు.

> కాగా నా జీవితకాలమంతయు నేనీలాగు నిన్ను స్తుతించెదను. నీ నామమును బట్టి ***నా చేతులెత్తెదను*** (కీర్తన 63:6)

మనము విధేయులమై గౌరవపూర్వకముగా మన దేవుని వైపు చేతులెత్తి:
సర్వలోక నివాసులారా,దేవుని గూర్చి సంతోష గీతము పాడుడి. ఆయన నామ ప్రభావము కీర్తించుడి. ఆయనకు ప్రభావము ఆరోపించి ఆయనను స్తోత్రించుడి. ఈలాగు దేవునికి స్తోత్రము చెల్లించుడి. ***నీ కార్యములు ఎంతో భీకరమైనవి***, నీ బలాతిశయమునుబట్టి నీ శత్రువులు లొంగి నీ యొద్దకు వచ్చెదరు (కీర్తన 66:1-4).

మనము ప్రభువు యొక్క ప్రభావమును ఆరోపించి, అద్భుతమైన ఆయన గుణలక్షనాలను స్తుతి చెల్లించాలి. దేవుని స్తుతించుటకై కావలసిన పదములు కనుగొనుటకు కీర్తన పుస్తకము సరియైన స్థలం. "ప్రభువా మీకు స్తోత్రం" అను ఒక మాట పదే పదే చెప్పటంకన్న ఆయనతో చెప్పటానికి ఇంకా అనేకమైనవి ఉన్నాయి.

రండి నమస్కారము చేసి ***సాగిలపడుదము***. మనలను సృజించిన యెహోవా సన్నిధిని మోకరించుదము (కీర్తన 95:6)

నిలువబడైన, మోకరించైన లేక సాష్టంగాపడుట ద్వారానైన సరే, మన శరీర భంగిమద్వారా ఆరాధన భావాన్ని వ్యక్తపరచవచ్చు.

భక్తులు ఘనతనొంది ప్రహర్షించుదురు గాక. వారు సంతోషభరితులై తమ ***పడకలమీద ఉత్సాహగానము చేయుదురుగాక*** (కీర్తన 149:5)

కేవలం నిలబడి లేదా మోకరించి ఉన్నప్పుడే కాక పడకపై పరుండి ఉన్నప్పుడు కూడా దేవుని ఆరాధించవచ్చును

***కృతజ్ఞతార్పణలు చెల్లించుచు*** ఆయన గుమ్మములలో ప్రవేశించుడి. కీర్తనలు పాడుచు ఆయన ఆవరణములో ప్రవేశించుడి. ఆయనను ***స్తుతించుడి*** ఆయన నామమును ఘనపరచుడి (కీర్తన 100:4)

స్తుతులు చెల్లించుట కూడ మన ఆరాధనలో ఒక భాగమై ఉండాలి.

***నాట్యముతో*** వారు ఆయన నామమును స్తుతించుదురు గాక (కీర్తన 149:3)

నాట్యముద్వారా కూడ మనము ప్రభువుని స్తుతించవచ్చు. కాని ఆనాట్యము లోక సంబంధమైనదిగాను అల్లరితోకూడినదిగాను ఉండకూడదు.

బూరధ్వనితో ఆయనను స్తుతించుడి. స్వరమండలముతోను సితారాతోను ఆయనను స్తుతించుడి. తంబురతోను నాట్యముతోను ఆయనను స్తుతించుడి. తంతి వాద్యములతోను పిల్లనగ్రోవితోను ఆయనను స్తుతించుడి. మ్రోగు తాళములతో ఆయనను స్తుతించుడి. గంభీరధ్వనిగల తాళములతో ఆయనను స్తుతించుడి. సకల ప్రాణులు యోహోవాను స్తుతించుదురు గాక యెహోవాను స్తుతించుడి (కీర్తన 150:3-6)

సంగీతపరమైన తలాంతులు గలవారిని బట్టి దేవునికి వందనస్తులమైయుండాలి

ప్రేమగలిగిన హృదయముతో వారు వాయిద్యములు వాయించినట్లయితే వారి తలాంతులు దేవుని ఘనపరచుటకు ఉపయోగించుకొన వచ్చును.

## ఆత్మీయమైన పాటలు

యెహోవా ఆశ్చర్యకార్యములు చేసియున్నాడు. ***ఆయననుగూర్చి క్రొత్తకీర్తన పాడుడి*** (కీర్తన 98:1)

ఆచారముగా మారనంతవరకు పాతపాటలు పాడుటలో ఏ మాత్రం తప్పు లేదు. అప్పుడు మన హృదయాంతరంగాలలో నుండి వెలువడె నూతన కీర్తన అవసరమవుతుంది. క్రొత్త నిబంధనలో ఆ క్రొత్త పాటను పాడుటకు పరిశుద్ధాత్మ సహాయం చేయునని మనం నేర్చుకొనుచున్నాము.

> సంగీతములతోను కీర్తనలతోను ఆత్మసంబంధమైన పద్యములతోను ఒకనికి ఒకడు బోధించుచు, బుద్ధి చెప్పుచు కృపా సహితముగా మీ హృదయములలో దేవునిగూర్చి గానము చేయుచు, సమస్తవిధములైన జ్ఞానముతో క్రీస్తు వాక్యము మీలో సమృద్ధిగా నివసింపనియ్యుడి (కొలస్స 3:16)
>
> మరియు మద్యముతో మత్తులైయుండకుడి, దానిలో దుర్వ్యాపారము కలదు, అయితే ఆత్మ పూర్ణులైయుండుడి. ఒకనినొకడు కీర్తనలతోను సంగీతముల తోను ఆత్మసంబంధమైన పాటలతోను హెచ్చరించుచు, మీ హృదయములలో ప్రభువునుగూర్చి పాడుచు కీర్తించుచు, మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట సమస్తమునుగూర్చి తండ్రియైన దేవునికి ఎల్లప్పుడును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు (ఎఫెసీ 5:18-20)

కీర్తనలతోను ఆత్మసంబంధమైన పాటలతోను ఒకరికొరకు ఒకరు పాడుమని పౌలు వ్రాస్తున్నాడు. ఈ మూడింటిమద్య తేడా ఉండి ఉండాలి. గ్రీకు భాషలో పరిశీలన చేసినట్లయితే వీటిని అర్ధం చేసుకొనుటకు మనకు కొంత సహాయం లభిస్తుంది "సంగీతం" అంటే బహుశా బైబిలులో ఉన్న కీర్తనలను సంగీత వాయిద్యములతో పాడుటయై ఉండవచ్చును. "కీర్తన" అనగా సంఘములో ఉన్న విశ్వాసులు కూర్చిన స్తుతి గీతాలైయున్నవి. "ఆత్మీయ పాటలు" అప్పటికప్పుడు పరిశుద్ధాత్మ ప్రేరేపణద్వారా కలిగిన గీతాలు మరియు ఇవి ప్రవచనా వరముతో సమానమైయున్నవి. అయితే ప్రవచనంలో చెప్పబడే మాటలు పాటలరూపంలో ఉంటాయి.

కేవలం మనం సంఘముగా కూడుకున్నప్పుడు మాత్రమే కాకుండా స్తుతి ఆరాధన మన అనుదిన జీవితంలో భాగమై ఉండాలి. దినమంతా మనం దేవుని సేవలో ఉంటూ ఆయనను ఆరాధిస్తూ ఆయనతో సమీప సంబంధ సహవాసాన్ని మనం అనుభవించవచ్చు.

## స్తుతి : విశ్వాసముయొక్క క్రియారూపం

స్తుతి మరియు ఆరాధనలు దేవుని యందు మనకున్న విశ్వానము యొక్క బావ

ప్రకటనలు. దేవుని వాగ్దానములను మనం నిజంగా విశ్వసించినట్లైతే మనం పూర్ణ ఆనందముతో ఆయనను స్తుతించువారముగా ఉంటాము. యెహోషువా మరియు ఇశ్రాయేలు ప్రజలు మొట్టమొదట బిగ్గరగా కేకలు వేశారు, తర్వాత యెరికో గోడలు కూలినాయి. "ఎల్లప్పుడు ప్రభువునందు ఆనందించమని" (ఫిలిప్పు 4:4) మరియు "ప్రతి విషయమందు కృతజ్ఞతా స్తుతులు చెల్లించమని" (1 థెస్స 5:18) బైబిలు సెలవిస్తోంది.

2వ దినవృత్తాంతము 20వ అధ్యాయములో స్తుతిలోని శక్తిని గురించి ఒక అద్భుతమైన ఉదాహరణ కనిపిస్తుంది. ఇది యూదా దేశము మోయాబు మరియు అమ్మోను దేశాలచే ముట్టడి చేయబడిన సంఘటన. రాజైన యెహోషాపాతు యొక్క ప్రార్థనకు జవాబుగా దేవుడు ఇశ్రాయులీయులను ఈ క్రింది విధంగా చేయమని చెప్పాడు.

> ఈ గొప్ప సైన్యమునకు మీరు భయపడకుడి, జడియకుడి, ఈ యుద్ధము మీరు కాదు దేవుడే జరిగించును. రేపు వారిమీదికి పోవుడి.... ఈ యుద్ధములో మీరు పోట్లాడవలసిన నిమిత్తము లేదు; యూదావారలారా, యెరూషలేము వారలారా, మీరు యుద్ధపంక్తులు తీర్చి నిలువబడుడి; మీతో కూడనున్న యెహోవా దయచేయు రక్షణను మీరు చూచెదరు; భయపడకుడి, జడియకుడి రేపు వారి మీదికి పోవుడి, యెహోవా మీతో కూడ ఉండును (2 దిన20:15-17)
>
> అంతట వారు ఉదయముననే లేచి తెకోవ అరణ్యమునకు పోయిరి, వారు పోవుచుండగా యెహోషాపాతు నిలువబడి.. యూదావారలారా, యెరూషలేము కాపురస్థులారా, నా మాట వినుడి; మీ దేవుడైన యెహోవాను నమ్ముకొనుడి, అప్పుడు మీరు స్థిరపరచబడుదురు; ఆయన ప్రవక్తలను నమ్ముకొనుడి, అప్పుడు మీరు కృతార్థులగుదురని చెప్పెను. మరియు అతడు జనులను హెచ్చరిక చేసిన తరువాత యెహోవాను స్తుతించుటకు గాయకులను ఏర్పరచి, వారు పరిశుద్ధాలంకారములు ధరించి సైన్యము ముందర నడచుచు... యెహోవా కృప నిరంతరముండును, ఆయనను స్తుతించుడి అని స్తోత్రము చేయుటకు వారిని నియమించెను. వారు పాడుటకును స్తుతించుటకును మొదలు పెట్టగా యెహోవా యూదావారిమీదికి వచ్చిన అమ్మోనీయులమీదను మోయాబీయులమీదను శేయూరు మన్యవాసులమీదను మాటుగాండ్రను పెట్టెను గనుక వారు హతులైరి. అమ్మోనీయులును మోయాబీయులును శేయూరు మన్యనివాసులను బొత్తిగా చంపి నిర్మూలము చేయవలెనని పొంచియుండి వారిమీద పడిరి; వారు శేయూరు కాపురస్థులను కడముట్టించిన తరువాత తమలో ఒకరి నొకరు చంపుకొనుటకు మొదలుపెట్టిరి. యూదా వారు

అరణ్యమందున్న కాపరుల దుర్గము దగ్గరకు వచ్చి సైన్యముతట్టు చూడగా వారు శవములై నేలపడియుండిరి, ఒకడును తప్పించుకొనలేదు. యెహోషాపాతును అతని జనులును వారి వస్తువులను దోచుకొనుటకు దగ్గరకు రాగా ఆ శవములయొద్ద విస్తారమైన ధనమును ప్రశస్తమైన నగలును కనబడెను; వారు తమకిష్టమైనంతమట్టుకు తీసికొని తాము కొని పోగలినంతకంటె ఎక్కువగా ఒలుచుకొనిరి; కొల్లసొమ్ము అతి విస్తారమైనందున దానిని కూర్చుటకు మూడు దినములు పట్టెను.''(2దిన 20-25)

విశ్వాసముతో నిండిన స్తుతులు పోషణను మరియు రక్షణను నొసగుతాయి!

స్తుతిలోని శక్తిని గురించి ఇంకా తెలిసికొనుటకు ఇవి చదవగలరు:

ఫిలిప్పు 4:6-7(స్తుతి శాంతిని తెస్తుంది), 2దిన 5:1-14(స్తుతి దేవుని సన్నిధిని తెస్తుంది), అపొ 13:1-2(స్తుతి దేవుని ఉద్దేశ్యాన్ని ప్రణాళికను బయల్పరుస్తుంది), అపొ 16:22-26 (స్తుతి దేవుని కాపుదలను కలిగించి చెరసాల బంధకములనుండి విడుదల కలిగిస్తుంది).

